క్లుప్తంగా

ఆదోనిలో డ్రోన్ సర్వే



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆదోని టౌన్ : పట్టణంలో 'జగనన్న శాశ్వత భూహక్కు–భూసంరక్షణ పథకం' లో భాగంగా డ్రోన్ సర్వేను బుధవారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, టీపీఓ శ్రీనివాసులు బసాపురం రోడ్డు నుంచి సర్వే చేపట్టారు. సర్వే నాలుగు రోజులపాటు జరుగుతుందని, పట్టణ విస్తీర్ణం, ఫొటోలతో కూడిన సర్వే జరుగుతుందని కమిషనర్ చెప్పారు. సర్వే అనంతరం ప్రతి ఇంటికి సర్వే నంబర్‌తో కార్డులు అందజేస్తామని తెలిపారు.

శ్రీ మఠానికి విరాళం

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన రఘురామరెడ్డి రూ 1.02 లక్షలు, రాజు రెడ్డి రూ.50 వేలను గోసంరక్షణ సేవకు వినియోగించాలని విరాళంగా అందజేశారని శ్రీ మఠం మేనేజర్ ఎస్.కె.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. వీరు అంతకు ముందు గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం కప్పి, ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వాదించారు.

పోలీసులకు వైద్య పరీక్షలు

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు వేణుగోపాల్‌రాజు, కిరణ్, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంత్రాలయం, మాధవరం పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న పోలీసు సిబ్బందికి కర్నూల్‌లోని మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు.

ముగిసిన శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అసిస్టెంట్ అధికారి చంద్రశేఖర్

ఆదోని అర్బన్ : స్థానిక ఇంద్రానగర్ కాలనీలో నున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు రోజులపాటు మలేరియా వ్యాధిపై జరిగిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. జిల్లా మలేరియా అసిస్టెంట్ అధికారి చంద్రశేఖర్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్‌లు ప్రసాద్, సతీష్, ఆదోని డివిజన్ మలేరియా అధికారి మంజునాథ పాల్గొని ల్యాబ్ టెక్నీషియన్‌లకు మలేరియా వ్యాధిపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షలు ఎలా నిర్వహించాలో వివరించారు. అలాగే..వివిధ పీహెచ్‌సీల్లో పనిచేసే టెక్నీషియన్లు జాగ్రత్తగా మలేరియా పారాసెట్స్ గుర్తించి రిపోర్టులు అందజేయాలని చెప్పారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

ఆదోని రూరల్ : ఈనెల 14వ తేదీన అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహిద్దామని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కల్లుపోతుల సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సి.ఆర్.స్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన సురేష్ మాట్లాడారు. శుక్రవారం అంబేడ్కర్ భవన్ నుంచి ర్యాలీ నిర్వహిస్తామని మాలలందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జైభీమ్ సాయిరామ్, నాయకులు శ్రీనివాసులు, నాగార్జున, యువరాజ్, నరేష్‌కుమార్, జగదీష్ పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



శంకరబండలో లింగమేశ్వర స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని బిణిగేరిలో ఆంజినేయస్వామి, శంకరబండలో లింగమేశ్వర స్వామి రథోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయాల్లో స్వామి వారికి గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కుంభోత్సవం, నందికోలు సేవతో స్వాముల వారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి ఆంజనేయస్వామి, లింగమేశ్వర నామస్మరణంతో గ్రామాల చివరకు లాగారు. అక్కడ పూజలు నిర్వహించి తిరిగి ఆలయాలకు చేర్చారు. భక్తులు పెద్దఎత్తున బాణాసంచా పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. సర్పంచులు విజయలక్ష్మి, వెంకటేష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కుండలకు భలే గిరాకీ

- వేసవిలో పెరిగిన కుండలు, కూజాలు, మట్టిపాత్రల తయారీ
- కోసిగి నుంచి వివిధ ప్రాంతాలకు విక్రయం
- వృత్తిపై ఆధారపడి 110 కుటుంబాల జీవనం

వేసవి వచ్చిందంటే చాలు.. ఆ ప్రాంతంలోని కొన్ని కుటుంబాలు నిత్యం బిజీగా ఉంటాయి. మట్టి తోలడం నుంచి కుండలు విక్రయించే పనుల్లో తలమునకలై ఉంటారు. ఈ సీజన్‌లో కుండలు, మట్టి పాత్రలకు గిరాకీ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా పేదల ఫ్రిడ్జ్‌గా పేరుగాంచిన కుండలకు డిమాండ్ ఎక్కువ. ప్రస్తుతం అన్ని వర్గాల వారు కుండలను కొనుగోలు చేస్తుండటంతో డిమాండ్ పెరిగింది. ఇక్కడ తయారైన కుండలు, మట్టి పాత్రలను ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో తయారీదారులకు చేతినిండా పని ఉంటోంది.

కోసిగి: వేసివిలో ప్రజలు చల్లని పానీయాలు, నీటిని తాగాలనుకుంటారు. ప్రస్తుతం ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో ఇంట్లో ఫ్రిడ్జ్ ఉన్నవారు సైతం కుండలను కొనుగోలు చేస్తున్నారు. ఒకప్పుడు పేదోడి ఫ్రిడ్జ్‌గా పేరుగాంచిన కుండ ప్రస్తుతం దాదాపు ప్రతి ఇంట్లో దర్శనమిస్తోంది. ఇతర కాలాల కన్నా డిమాండ్ ఎక్కువగా ఉండటంతో కోసిగిలో తయారవుతున్న కుండలకు గిరాకీ నెలకొంది. కుండలతో పాటు ఇక్కడ వివిధ రకాల కూజాలు, మట్టి పాత్రలు తయారవుతుండటంతో ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారు. దీంతో వాటి విక్రయాలు పెరిగిపోయాయి.

కోసిగిలో కుండలు తయారీ..

కోసిగిలో 110 కుటుంబాల శాలివాహన (కుమ్మరి) కులస్తులు జీవనం సాగిస్తున్నారు. జనవరి తరువాత ప్రతి ఒక్కరూ వివిధ రకాల మట్టి పాత్రలు తయారు చేయడం ప్రారంభిస్తారు. స్థానిక పెద్ద మసీదు, సిద్దప్ప పాళెం జేబీఎం స్కూల్ సమీపంలో, ఎన్టీఆర్ కాలనీలలో వారు నివాసం ఉంటున్నారు. గౌడుగల్లు చెరువు నుంచిమట్టి తీసుకొచ్చి ఇంటి ఆవరణ, ముందు కుండలు తయారు చేసి, కాల్చి విక్రయాలకు సిద్ధం చేస్తారు. కుండ సైజును బట్టి రూ.50 నుంచి రూ.300 వరకు విక్రయిస్తారు. తయారు చేసిన కుండలను కోసిగితో పాటు ఆదోని, ఎమ్మిగనూరు, చిన్నూరు, మాన్వి, శిరుగుప్ప, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు వచ్చి తీసుకెళ్తారు.



తయారు చేసి ఉంచి మట్టి పాత్రలు, కుండలు



కుండ తయారు చేస్తున్న కార్మికుడు

కేంద్ర ప్రభుత్వం చేయూత..

ఐదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం కుమ్మరి కులస్తులకు సబ్సిడీపై 40 ఎలక్ట్రానిక్ చక్రాలు అందజేసింది. ఇందుకు లబ్ధిదారులు రూ.2వేలు మాత్రమే చెల్లించారు. వాటితో మట్టి పాత్రలు తయారు చేయడం సులువుగా మారింది. గతంలో బండి చక్రానికి కర్రలు పెట్టి చేతితో తిప్పుతూ కుండలు తయారీ చేయడానికి ఇబ్బందులు పడ్డారు. పాత విధానంలో రోజుకు పది కుండలు మాత్రమే చేయగలుగుతారు. నూతన విధానంలో 25 వరకు తయారు చేస్తున్నారు. తయారు చేసిన కుండలను చేతితో చేసే పని ఎక్కువగా ఉంటుందని, ఆ పని లేకపోతే మిషన్ ద్వారా వంద వరకు తయారు చేయగలమని తయారీదారులు చెబుతున్నారు. ఇలా ఈ సీజన్ ముగిసే సమయానికి ఒక్కో కుటుంబ వెయ్యి నుంచి 1200 కుండలు అమ్ముతారు. ఈ సీజన్‌లో దాదాపు రూ. కోటి నుంచి రూ. 2కోట్ల వరకు వ్యాపారం జరుగుతుంది. ప్రభుత్వాలు బ్యాంక్‌ల ద్వారా రుణాలు మంజూరు చేస్తే వృత్తిని, వ్యాపారాన్ని విస్తరించుకుంటామని తయారీదారులు పేర్కొంటున్నారు.

కుండలకు గిరాకీ ఉంది



మా కుటుంబం కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. ఎండ కాలం వస్తే కుండలకు గిరాకీ బాగా ఉంటుంది. ఈ కాలంలో ఫ్రిజ్‌లో నీటి కన్నా కుండలో నీటిని తాగడం ఆరోగ్యం కరం. అందుకే చాల మంది ప్రజలు కుండలను ఎక్కువ కొనుగోలు చేస్తున్నారు. కుండల సైజును బట్టి విక్రయిస్తాం.

– తిక్కయ్య, కోసిగి

వివిధ ప్రాంతాల కొనుగోలుదారులొస్తారు



కోసిగి ప్రాంతంలో 110 కుటుంబాల కుమ్మరి కులస్తులు కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ తయారయ్యే కుండలను ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తారు.కుటుంబాలు పెరిగిపోవడంతో కుండల తయారీకి ఇబ్బందులు పడుతున్నాం. కులవృత్తిని నమ్ముకుని జీవనం చేస్తున్న తమకు మట్టి వేసుకునేందుకు, కుండలను కాల్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక స్థలం కేటాయించి ఆదుకోవాలి.

– ఈరేష్, శాలివాహన సంఘం అధ్యక్షుడు, కోసిగి

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుడిని చూపుతున్న పోలీసులు

కౌతాళం: మండలంలోని ఉప్పరహాల్ గ్రామ శివారులో నున్నరామకమ్మగుడి వద్ద బుధవారం కర్ణాటక మద్యం తరలిస్తున్న నలుగురు వ్యక్తులతో పాటు మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ బదినేహాల్ గ్రామానికి చెందిన కిందగేరి మునిస్వామి, నాగప్ప, బోయ ప్రకాశ్,ఎస్. అయ్యప్ప మూడు ద్విచక్ర వాహనాల్లో 26 బాక్సుల కర్ణాటక ఒరిజినల్ చాయిస్,డీలక్స్ విస్కీబా క్సు లను తెస్తుండగా ఉప్పరహాల్ వద్ద సిబ్బందితో కలి సి అదుపులోకి తీసుకొని మద్యం, వాహనాలను స్వాధీ నం చేసుకున్నామని చెప్పారు. వీరికి మద్య సరఫరా చే సిన కర్ణాటకరాష్ట్రం మురణి గ్రామానికిచెందిన అయ్యప్ప పరారయ్యాడన్నారు.దాడుల్లో కానిస్టేబుల్ అశోక్, మంజునాథ,వీరభాస్కర్,నరేంద్ర,శ్రీరాములు ఉన్నారు.

నేడు జాబ్ మేళా

కర్నూలు: పీపుల్స్ హెల్త్ సొసైటీ, అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం (నేడు)కర్నూలులోని బిర్లాగేట్ దగ్గర ఉన్న కృష్ణకాంత్ ప్లాజాలోని బ్రహ్మరెడ్డి హాస్పిటల్ కాన్ఫ రెన్స్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పీపుల్స్ హెల్త్ సొసైటీ జిల్లా కన్వీనర్ సుజాత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి పాస్/ఫెయిల్, ఇంటర్ పాస్/ఫెయిల్, ఐటీఐ పాస్/ ఫెయిల్ (ఏ ట్రేడ్ అయినా) 18 నుంచి 25 సంవత్సరాలు వయస్సు లోపువారు జాబ్ మేళాకు అర్హులన్నారు. జాబ్ మేళాలో ఎంపికైన యువకులకు తిరుపతిలోని అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శిక్షణతో పాటు స్టైఫండ్ కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం 91004 77371, 91777 70090 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

కోసిగి: స్థానిక కడపాళెం వీధిలోని పురాతన మారెమ్మ దేవి దేవాలయ స్థల విషయంలో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్ హెచ్చరించారు. బుధవారం సమస్యకు కారణమైన స్థలాన్ని తహసీల్దార్ రుద్రగౌడతో కలిసి పరిశీలించారు. 30 ఏళ్ల క్రితం మారెమ్మ దేవి దేవాలయం ఉండేదని, ప్రస్తుతం ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ముందు భాగంలో కొత్తగా దేవాలయం నిర్మించుకున్నారు . అయితే ఆ ఆలయ స్థలం ఖాళీగా కావడంతో ఓ వర్గానికి చెందిన కొందరు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. మరో వర్గం ప్రజలు తమ ఆలయ సంబంధిత భూమి అంటూ వాగ్వాదానికి దిగారు. కాగా ఆ స్థలం సర్వే నంబర్ 175లో 28 సెంట్లు గ్రామ కంఠం కింద ఉందని తేలడంతో ఎవరికీ చెందినది కాదని, ఆక్రమణలకు పాల్పడటం, నిర్మాణాలు చేపట్టరాదని అధికారులు తెలిపారు. ఘర్షణలకు పాల్పడిన ఇరువర్గాలకు చెందిన 14 మందిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కొన్నాళ్లపాటు స్థలం వద్ద పోలీస్ పికెటింగ్ కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. సీఐ ఎరిసా వలి, ఎస్ఐ రాజారెడ్డి, ఎంపీపీ ఈరన్న, మాణిక్యరాజు ఉన్నారు.



స్థల సమస్యపై విచారణ చేస్తున్న డీఎస్పీ వినోద్‌కుమార్, తహసీల్దార్ రుద్రగౌడ



చిన్నహరివాణంలో పూజలందుకున్న దుర్గమ్మవ్వ



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఘనంగా దుర్గమ్మవ్వ దేవర

ఆదోని రూరల్ : మండలంలోని చిన్నహరివాణం గ్రామంలో దుర్గమ్మవ్వ దేవర బుధవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ఉదయం గ్రామస్తులు కుంభాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి ఆకుపూజ, పంచామృతాభిషేకం, జలాభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు.

18న చిత్రలేఖన పోటీలు

కర్నూలు కల్చరల్: భారత ప్రభుత్వ పృథ్వీ విజ్ఞాన మంత్రిత్వశాఖ, నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 18వ తేదీన జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. 2023 ధరిత్రి దినోత్సవ ప్రచార అంశం అయిన 'ఇన్వెస్ట్ ఇన్ అవర్ ప్లానెట్ 'పై సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. వీఆర్ కాలనీలోని నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆసక్తి కల వారు ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 93968 61308 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అభ్యంతరాలు తెలపండి

కర్నూలు(సెంట్రల్): పదో తరగతి పరీక్షలకు సంబంధించి స్పాట్ వాల్యుయేషన్ అసిస్టెంట్ ఎగ్జామినర్ల(ఏసీ)ల సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని డీఈఓ రంగారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాను బ్లాగ్ స్పాట్ కర్నూలు డీఈఓ13 అనే వెబ్‌సైట్‌లో ఉంచామని, స్పాట్‌వాల్యుయేషన్ ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు జిల్లాకేంద్రంలో జరుగుతుందని వివరించారు.

ఆదోని అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోని టౌన్ : పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రా ముంబాయిగా పేరుగాంచిన ఆదోనిని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని, అందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. బుధవారం పట్టణంలోని 13వ వార్డు శంకర్‌నగర్‌లో రూ.13 లక్షలతో మురుగు కాలువల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నారా లోకేష్ బాబు.. 'రెండు ఎకరాలు ఆసామి అయిన మీ నాన్న చంద్రబాబునాయుడు అన్ని కోట్ల రూపాయలు ఎలా సంపాదించారు.. ముందు అది తెలుసుకొని ఇతరులపై విమర్శలు చేయ్.. పాదయాత్ర పేరుతో ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలు, మంత్రులను టార్గెట్‌గా చేసుకుని నిందలు వేయడం, బురదజల్లడమే పనిగా పెట్టుకున్నావ్, ఇది మంచి పద్ధతికాదు, ముందుగా మీ తండ్రిగారి అక్రమాల గురించి తెలుసుకుని మాట్లాడాల'ని మండిపడ్డారు. మీ నాన్నా అక్రమ సంపాదనతోనే నేడు పాదయాత్ర చేస్తున్నావు అది గుర్తు పెట్టుకో అంటూ విమర్శించారు. జగన్ లాంటి సీఎం దేశంలో ఎక్కడా లేరన్నారు. పట్టణంలో 4,720 టిడ్కో ఇళ్లు, నియోజకవర్గంలో 15 వేల మందికి ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. గతంలో చంద్రబాబునాయుడు చేసిన అప్పులు నేడు సీఎం జగన్ చెల్లిస్తున్నారన్నారు.

వాహనాలు ప్రారంభం

ఆదోని మున్సిపాలిటీలో వంద శాతం శానిటేషన్‌ను సాధించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మంజూరైన 3 చెత్తను ఎత్తివేసే కాంప్రాక్టర్‌లను మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌తో కలిసి ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దేవా, నాయకులు కల్లుబావి నాగేంద్ర, తిమ్మప్ప, వీరభద్రారెడ్డి, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

తక్కువ ఎత్తులో విమానం చక్కర్లు



హొళగుంద మీదుగా వెళ్తున్న విమానం

హొళగుంద: మండల కేంద్రం మీదుగా తేలికపాటి విమానం గత వారం రోజులుగా చక్కర్లు కొడుతోంది. తక్కువ ఎత్తులో విమానం వెళుతుండడంతో చూసేందుకు పిల్లలు ఎగబడ్డున్నారు. 10 లోపు సీట్లున్న ఈ విమానం ఉత్తరం వైపున్న పెద్ద కొండ పక్క నుంచి దక్షిణ వైపున్న కర్ణాటక సరిహద్దు వరకు తిరుగుతుంది. రోజుకు పలుమార్లు చక్కర్లు కొడ్తుండడంతో జనం పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. అయితే ఏరియల్ సర్వే నిమిత్తం ఈ తేలికపాటి విమానం తిరుగుతున్నట్లు తెలుస్తోందని ఎస్ఐ అబ్దుల్‌జహీర్ తెలిపారు.

విధులు మరచి.. మత్తులో మునిగి

- డ్యూటీ టైంలో మద్యం సేవిస్తూ కెమెరాకు చిక్కిన ఆర్ఐ

ఆదోని అర్బన్: విధులు నిర్వర్తించాల్సిన సమయంలో ఓ రెవెన్యూ అధికారి మత్తులో మునిగిన ఘటన పట్టణంలోని ఓ బార్‌అండ్ రెస్టారెంట్‌లో చోటు చేసుకుంది. ఆలూరు ఇన్‌చార్జ్ ఆర్ఐ బసవన్నగౌడ్ బుధవారం మధ్యాహ్నం ఆదోని పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం సేవిస్తూ కనిపించారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి.ఈ విషయంపై ఆలూరు తహసీల్దార్ విజయ్‌ను వివరణ కోరగా ..ఆయన ఇక్కడే విధుల్లో ఉన్నారని చెప్పడం విశేషం.



బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం సేవిస్తున్న ఆర్ఐ బసవన్నగౌడ్

మాతామరణాలు జరగకుండా చూడాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మాతామరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆదేశించారు. బుధవారం ఆయన తన ఛాంబర్‌లో మాతృమరణాలపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కౌతాళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గొడూరు గ్రామంలో గత మార్చిలో సంభవించిన మాతృమరణంపై ఆయన సమీక్ష చేశారు. కార్డియాక్ పల్మనరీ అరెస్ట్ కారణంతో మరణం జరిగిందని కమిటీ నిర్ధారించింది. క్షేత్రస్థాయిలోని సిబ్బంది ఆశా, ఆరోగ్య కార్యకర్త, వైద్యాధికారులు గర్భవతులను తొందరగా గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యసేవలు అందించినట్లయితే తల్లుల మరణాల శాతం తగ్గించవచ్చని కమిటీ నిర్ధారించింది. ప్రతి నెలా 9వ తేదీన జరిగే ప్రధాన మంత్రి మాతృ వందన యోజన అనే కార్యక్రమాన్ని ప్రతి ఆరోగ్య కేంద్రంలో నిర్వహించాలని సూచించారు. ఒకవేళ ఆ గర్భవతులను హైరిస్క్‌గా గుర్తించినట్లయితే ఆశా, ఆరోగ్య కార్యకర్త, పర్యవేక్షకులతో ట్రాక్ చేసి ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స అందించినట్లయితే మాతాశిశు మరణాలు తగ్గించవచ్చని, గర్భవతుల కుటుంబసభ్యులు కూడా వారి చికిత్సపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో సూచించారు. సమావేశంలో గైనకాలజి హెచ్‌వోడీ డాక్టర్ ఎస్.వెంకటరమణ, డీఐవో డాక్టర్ వై. ప్రవీణ్ కుమార్, డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ శ్రీధర్‌శర్మ, డాక్టర్ శ్రావణి, డాక్టర్ సుధీర్‌కుమార్, డీపీహెచ్ఎన్‌వో లిన్నెట్ లిడియా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

ఆదోనిటౌన్: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కౌన్సిలర్లు సురేష్, ఫయాజ్‌అహ్మద్, తాయన్న, చలపతి, రమేష్‌యాదవ్ అన్నారు. బుధవారం 'జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 1, 2, 16, 18, 31, 36 వార్డుల్లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి వారి అనుమతితో ఇంటికి స్టిక్కర్లు అతికించారు.

ఆదోని రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి పేర్కొన్నారు. మండిగిరిలోని శాంతి ఎస్టేట్, రామచంద్రానగర్, తిరుమలనగర్, రాయచోటి సుబ్బయ్య కాలనీల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అలాగే మండలంలోని కపటి, ఆరేకల్, పెద్దతుంబళం, పెద్దహరివాణం, మదిరె, విరుపాపురం, నాగలాపురం, బసాపురం గ్రామాల్లో గృహసారథులు, కన్వీనర్లు నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఇంటింటికీ తిరిగి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. నాయకులు కడితోట ఈరన్న, కన్వీనర్ ఉలిగప్ప, వీరారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: మంత్రాలయంలో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, కాచాపురం గ్రామంలో కృష్ణారెడ్డి, సోళ్లహాళ్లి గ్రామంలో ఉరుకుంద ఈరన్నస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం కొనసాగింది.



ఒకటవ వార్డులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న కౌన్సిలర్ సురేష్, దేవా, కార్యకర్తలు, నాయకులు

కోసిగి: స్థానిక సచివాలయం–2 పరిధిలో బుధవారం ఎంపీపీ ఈరన్న ఆధ్వర్యంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ తిరిగి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం చేపట్టారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గత టీడీపీ పరిపాలన, ప్రస్తుత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన తీరులో తేడాలను వివరించి మద్దతు తెలిపిన వారి నుంచి 8296082960లకు మిస్డ్‌కాల్ ఇప్పించారు.


కౌతాళం: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉరుకుంద ఈరన్నస్వామి ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ అన్నారు. బుధవారం ఉరుకుంద గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. మేళిగనూరు నదిచాగి గ్రామ నాయకులు రామన్నగౌడ్, ఎంపీటీసీ లింగన్నగౌడ్ గ్రామంలో పర్యటించారు. కుంబళనూరు క్యాంపులో సీనియర్ నాయకులు శేషారావు, అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజల అభిప్రాయాలు సేకరించారు. బదినేహాల్ ఉప సర్పంచ్ ప్రసన్నగౌడ్ గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించి స్టిక్కర్లను అతికించారు. అలాగే కౌతాళంలో పాతఈర్ల మండల కన్వీనర్ ప్రహల్లదచారి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, నాయకులు చౌదరిబసవ, సమద్ పాల్గొన్నారు.



కోసిగి సచివాలయం–2 పరిధిలో ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్న దృశ్యం

అడిగిన వారందరికీ పనులు కల్పిస్తాం

కృష్ణగిరి: జిల్లావ్యాప్తంగా వేసవిలో లక్షన్నర మందికి ఉపాధి పనులు కల్పించేలా లక్ష్యంగా పెట్టుకున్నామని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. కృష్ణగిరి మండల పరిధిలోని అమకతాడు గ్రామ సమీపంలో బుధవారం చెక్‌డ్యాంలో పూడికతీత పనులను, ఉపాధి పథకం కింద సాగు చేసిన పండ్ల మొక్కలను ఆయన పరిశీలించి అనంతరం కూలీలతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా రోజుకు 90 వేల మంది పనులకు వస్తున్నారని ఈ నెల చివరికల్లా దీన్ని లక్షన్నరకు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఎండలు అధికంగా ఉండటంతో ఉదయం త్వరగా వచ్చి పనులు చేసుకోవాలని, పని ప్రదేశంలో నీడ, తాగునీరు, ప్రాథమిక చికిత్స కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం కృష్ణగిరి ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో 6 వేల మంది కూలీలు పనులకు రావాల్సి ఉండగా 4 వేల మంది మాత్రమే వస్తున్నారని కూలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. విజిలెన్స్ అధికారి సిద్దలింగమూర్తి మాట్లాడుతూ సామాజిక తనిఖీల్లో గుర్తించిన అవకతవకలకు సంబంధించి వంద శాతం సొమ్మును రికవరీ చేయాలని సూచించారు. అసిస్టెంట్ డీపీఓ పక్కీరప్ప, ఎంపీడీఓ మోహన్ కుమార్, ఏపీఓలు అబ్దుల్‌షకూర్, శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్ చెన్నకేశవులు, ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్ ఉన్నారు.



అమకతాడు సమీపంలో చెక్‌డ్యాం పూడికతీత పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి